క్లుప్తంగా

మీడియా సంస్థలపై దాడులు తగదు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): మీడియా సంస్థలపై దాడులు తగదని ఏపీయూడబ్ల్యూజేఎఫ్ సీనియర్ నాయకులు పానుగంటి చంద్రయ్య కేంద్ర ప్రభుత్వానికి హితవు పలికారు. గురువారం ఏపీయూడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూస్ క్లిక్‌పై కక్షసాధింపు చర్యలు ఆపాలన్నారు. ధర్నాకు ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు మునెప్ప, చంద్రశేఖర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ప్రజా సంఘాల నాయకులు శేషఫణి, జమ్మన్న, రోషన్ అలీ మద్దతు తెలుపగా, నాయకులు నాగేంద్ర, రాజశేఖర్ పాల్గొన్నారు.

బీఈడీ పరీక్షలకు 371 మంది గైర్హాజరు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు గురువారం 371 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 16 కేంద్రాల్లో జరుగుతున్న బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు 3,425 మంది గానూ 3,054 మంది హాజరయ్యారన్నారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆయన తెలిపారు.

నియామకపత్రాల అందజేత

కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్ పార్టీ కార్మిక అనుబంధ సంఘం ఐఎన్‌టీయూసీలో గురువారం పలువురికి నియామక పత్రాలు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బతుకన్న ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి బొగ్గుల పరమేష్, జిల్లా ఉపాధ్యక్షుడిగా బొగ్గుల జోసెఫ్‌లను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు బతుకన్న నియామక పత్రాలు అందజేశారు. తంగా పదవులను పొందిన వారిని ఆయన అభినందించి..వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని కోరారు.

ఆటో డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు చేస్తాం

కర్నూలు(సెంట్రల్): నగరంలోని ఆటో డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు చేస్తానని, అవసరమైన వారికి అద్దాలను కూడా ఉచితంగా అందజేస్తానని కంటి వైద్యుడు జయప్రకాష్ అన్నారు. గురువారం సుందరయ్య ఆటో స్టాండ్ వార్షికోత్సవంగా సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని ఆటోలు నడపాలన్నారు. అతివేగం తగదన్నారు. ప్యాసింజర్ల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ నాయకురాలు పి.నిర్మల, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, నాయకుడు బి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్‌కు ఆయన నివాసంలో సీపీఐ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా పి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర వర్షాభావం నేపథ్యంలో అన్నదాతలు వేసిన పంటలన్నీ ఎండిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. తక్షణమే ప్రభుత్వం కలుగజేసుకొని ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ చార్జీలు తగ్గించాలి

కర్నూలు(సెంట్రల్): కరెంట్ చార్జీలను తక్షణమే తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు మహ్మద్ షరీఫ్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని అలాషేర్‌బాగ్‌లో ఆయన పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కాలువలను శుభ్రం చేయించాలని, రోడ్లు వేయించాలని ప్రజలు కోరినట్లు చెప్పారు.

15 నుంచి ప్రాథమిక శిక్షావర్గ

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ ప్రాథమిక శిక్షావర్గ -2023ను ఈనెల 15 నుంచి 22వ తేదీ వరకు జగన్నాథ గట్టు రోడ్‌లోని రిడ్జ్ పాఠశాలలో జరుగుతుందని ఆర్ఎస్ఎస్ సంఘ చాలక్ డాక్టర్ ఎన్.వి.ఎస్.గుప్త గురువారం తెలిపారు. పదోతరగతి, ఆపై స్థాయి విద్యార్థులు శిక్షా వర్గలో పాల్గొన వచ్చన్నారు. మరిన్ని వివరాలకు 6300206402 ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన

కర్నూలు(రాజ్‌విహార్): స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ వద్ద డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోడ్డు రవాణా సంస్థ కర్నూలు-2 డిపో మేనేజరు సర్దార్ హుసేన్ మాట్లాడుతూ సురక్షిత ప్రయాణాలకు ఆర్టీసీకి మంచి పేరుందన్నారు. దీనికి అనుగుణంగా పనిచేసి, ప్రమాద రహిత డ్రైవర్లుగా పేరు తెచ్చుకోవాలని సూచించారు. చెయ్యి ఎత్తిన చోట బస్సు ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో పాటు కోరిన చోట దించాలని, అప్పుడే ప్రయాణికుల మన్ననలు పొందగలుగుతామని సూచించారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన

- ప్రభుత్వం చేసిన ప్రతి మేలును వివరించండి
- సంక్షేమం, అభివృద్ధి, వైద్య, విద్య రంగాలకు చేసిన కృషిని చెప్పండి
- గత సీఎం చంద్రబాబు చేసిన మోసాలు ఎత్తి చూపండి
- నాటి, నేటి ప్రభుత్వ పనితీరును వివరించండి
- మళ్లీ వైఎస్సార్‌సీపీ రావాల్సిన అవసరాన్ని చెప్పండి
- పార్టీ నాయకులు సమావేశంలో ఎమ్మెల్యే, మేయర్



మాట్లాడుతున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్. చిత్రంలో మేయర్ బీవై రామయ్య



గృహసారథులు, కన్వీనర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్రంలో మళ్లీ జగనన్న ప్రభుత్వం వస్తేనే సంక్షేమ, సుపరిపాలన సాధ్యమవుందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం స్థానిక పాత బస్టీలోని పార్టీ కార్యాలయంలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే సీఎం ఎందుకు కావాలంటే..? (వై ఏపీ నీడ్ జగన్) కార్యక్రమాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్యతో కలిసి నిర్వహించారు. కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు, పార్టీ ఇన్‌చార్జీలు, ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నాయని, ఈ నేపథ్యంలో క్రియాశీలకంగా పనిచేసి పార్టీ గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి, వీటి వల్ల పేదలకు చేకూరిన లబ్ధిని వివరించాలన్నారు. తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లాలని, ఏ హోదాలో ఉన్న వారు అందుకు తగ్గట్లు ప్రణాళిక సిద్ధం చేసుకొని పార్టీ సూచించిన బాధ్యతలు తప్పనిసరిగా నిర్వర్తించాలన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసి చరిత్ర సృష్టించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని, ఇదే విషయాన్ని ప్రజలకు చెప్పాలన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి, వైద్య, విద్య రంగాలకు చేసిన కృషిని వివరించాలని, పేదరికం నిర్మూలనకు తీసుకున్న చర్యలు వివరించాలన్నారు. గత సీఎం చంద్రబాబు 2014 ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేసిన వైనాన్ని ఎత్తి చూపాలన్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో గెలవాలన్నదే జగనన్న లక్ష్యమని, అందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలతో పాటు రెండు పార్లమెంట్లలో పార్టీ జెండా మరోసారి ఎగరవేయాలన్నారు. నాటి, నేటి ప్రభుత్వ పనితీరును ప్రజల వద్దకు వెళ్లి వివరించాలన్నారు. ప్రజలకు అండగా ఉండి, వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం కోసం పని చేయాలన్నారు. వార్డులో ఎవరికి కేటాయించిన సచివాలయాలు, క్లస్టర్లను వారు తప్పనిసరిగా కవర్ చేయాలని చెప్పారు. చంద్రబాబు మోసాలు, అవినీతి, నిధుల దుర్వినియోగంపై వివరించాలని, తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. రాష్ట్రం బాగుండడంతో పాటు ప్రజలు సంతోషంగా ఉండాలంటే మళ్లీ వైఎస్ఆర్‌సీపీనే రావాలని చెప్పాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మతో పాటు క్లస్టర్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ జె సుధాకర్

- రానున్న రెండు, మూడు నెలలు కీలకం
- ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయండి
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు (సిటీ): కోడుమూరు నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దామని ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గురువారం స్టాంటన్‌పురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ గృహసారథులు, కన్వీనర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. రానున్న రెండు నెల లు కీలకమని, ఎవరికి కేటాయించిన పని వారు ప్రణాళికాబద్ధంగా చేయాలని సుధాకర్ సూచించారు. నాలుగున్నరేళ్లలో ము ఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభు త్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, వీటి వల్ల చేకూరిన లబ్ధి ని ప్రజలకు వివరించాలన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను జగనన్న 98 శాతం అమలు చేసిన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. చంద్రబాబు అవినీతిని, పవన్ నాటకాలను ఎత్తి చూ పాలన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా పథకాలు అందిస్తున్న జగనన్నే మరోసారి ఏపీకి అవసరమనే సంగతిని ప్రజలకు విడమరిచి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యరంగాన్ని టీడీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది

కర్నూలు (సిటీ): వైద్యరంగాన్ని టీడీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్ అన్నారు. గురువారం కర్నూలు మండలం నందనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి ప్రసంగించారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవలను అందించడంలో నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి ప్రజల ఆరోగ్య వివరాలు సేకరించి స్పెషలిస్ట్ వైద్యులతో వైద్యం చేయించడమనే కాన్సెప్ట్ అద్భుతమన్నారు. వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్, వైద్య శిబిరాన్ని పరిశీలించి డాక్టర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, ఈఓఆర్‌డీ అనురాధ, డిప్యూటీ తహసీల్దార్ భాను, సర్పంచు మాధురి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు వాసు, స్థానిక నాయకులు మజీద్, సురేష్, గార్గేయపురం మాజీ సర్పంచు ఏసేపు, ఉల్చాల సర్పంచు విద్యాసాగర్ పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్): స్థానిక న్యాయ సేవా సదన్‌లో బాలల హక్కులు, కేసులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి.హెచ్.వెంకటనాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ 14ఏళ్లలోపు వారిని పనిలో పెట్టుకోకూడదన్నారు. పిల్లలకు విద్య పట్ల ఆసక్తి కల్పించాలన్నారు. సమావేశంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, బీసీ వెల్ఫేర్ అధికారి పి.వెంకటలక్ష్మమ్మ, పోలీసు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

బాలికల హాస్టల్ తనిఖీ

స్థానిక కలెక్టరేట్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్, ఆనంద నిలయం, బీసీ బాలికల హాస్టళ్లను గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. హాస్టళ్లలోని సౌకర్యాలు, ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- కర్నూలు మేయర్ బీవై రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్

కర్నూలు (సిటీ): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు మేయర్ బీవై రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ప్రజలకు సూచించారు. గురువారం కర్నూలు అర్బన్ పరిధిలోని 103 సచివాలయం ఆవరణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారు ప్రారంభించి ప్రసంగించారు. పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలను దగ్గర చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. బీపీ, షుగర్‌తో పాటు గుండె వ్యాధుల బారిన పడినవారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యం అందిస్తున్నామన్నారు. అనంతరం మేయర్, ఎమ్మెల్యే బరువు, బీపీ, రక్త పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు విక్రమసింహారెడ్డి, సాంబశివరావు, జేసీఎస్ కరీం, గిరి, జగన్, రాము పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలపై విస్తృత ప్రచారం చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలపై ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పందన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట ఉన్న విద్యార్థులను గుర్తించి వంద శాతం పాఠశాలలకు పంపాలన్నారు. మనబడి నాడు-నేడు పనులకు నిధుల కొరత లేదని, నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. కిచెన్ షెడ్స్, నీటి సమస్యలు, టాయిలెట్ల నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నామని, వాటిని వెంటనే పూర్తి చేసుకోవాలన్నారు. ఫర్నీచర్, టీచింగ్ బోర్డులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొత్తగా జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయడానికి అనుమతులు ఇస్తున్నామన్నారు. సచివాలయ ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లతోపాటు మహిళా పోలీసులు ఎప్పటికప్పుడు పాఠశాలలను సందర్శించాలన్నారు. పాఠశాలలకు కొత్తగా వంట పాత్రలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అక్టోబర్‌లో నిర్మాణాలు పూర్తైన ఇళ్లను ప్రారంభించే అవకాశం ఉండడంతో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు సంబంధించి మహిళల్లో రక్త హీనతను నివారించేందకు గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు చిన్నారులకు టేక్ హోం రేషన్ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. బాల్య వివాహాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 1098 నంబర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఇతర జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను వేగవంతం చేయాలి

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అభివృద్ధి పనులపై మండలాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టాయిలెట్లకు సంబంధించి 5,కిచెన్ షెడ్లకు సంబంధించి 4 పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అదనపు తరగతి గదులకు సంబంధించిన పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. రీసర్వేకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఆర్‌డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో స్టేజ్ కన్వర్షన్‌లో వేగం పెరగాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, ఏపీసీ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ హౌసింగ్ పీడీ లింగమూర్తి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

జగన్ హయాంలో గిరిజనులకు సముచిత స్థానం

కర్నూలు(అర్బన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో గిరిజనులకు సముచిత స్థానం దక్కిందని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చెంద్రప్ప అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గిరిజన సామాజిక వర్గాల్లో ఎంతో సీనియర్ అయిన పీడిక రాజన్న దొరకు గిరిజన సంక్షేమంతో పాటు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారన్నారు. అలాగే అశ్వర్థనాయక్‌కు తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులుగా నియమించారన్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా కుంభా రవిబాబుకు అవకాశం కల్పించారని, తాజాగా రాష్ట్ర ఆర్థిక అంచనాల కమిటీ చైర్ పర్సన్‌గా పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి అవకాశం కల్పించారన్నారు. వెనుకబడిన గిరిజన కులాలకు అత్యంత ఉన్నతమైన పదవులను కట్టబెడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

సారా తయారు చేస్తే పీడీ చట్టం అమలు చేస్తాం

- సారా తయారీదారులకు డీఎస్పీ హెచ్చరిక



కొల్లంపల్లి తండాలో నిర్వహించిన గ్రామ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ

కర్నూలు: సారా తయారు చేస్తే పీడీ చట్టం కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ హెచ్చరించారు. ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొల్లంపల్లి తండా, ఓబులాపురం తండాలో గురువారం డీఎస్పీ విజయశేఖర్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నాటుసారా తయారీదారుల ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించి గ్రామ శివారులో ఉన్న నాటుసారా తయారీ బట్టీలపై దాడులు నిర్వహించారు. సుమారు 2,500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 65 లీటర్ల నాటుసారాను సీజ్ చేశారు. డీఎస్పీ గ్రామ సభ నిర్వహించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని డీఎస్పీ హెచ్చరించారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎలాంటి అవాంచనీయ ఘటనలకు పాల్పడకుండా గ్రామమంతా ఐకమత్యంగా ఉండాలన్నారు. కర్నూలు తాలూకా సీఐలు కిరణ్‌కుమార్‌రెడ్డి, శ్రీరామ్‌తో పాటు ఉలిందకొండ, ఓర్వకల్లు, నాగలాపురం, కర్నూలు ఫోర్త్ టౌన్, టూటౌన్ ఎస్ఐలు, సెబ్ ఎస్ఐ ప్రసాదరావుతో పాటు 60 మంది పోలీసు సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

రీసర్వే పనులను వేగవంతం చేయండి

- భూపరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్

కర్నూలు(సెంట్రల్): మూడవ విడత భూముల రీసర్వే పనులను వేగవంతం చేయాలని భూపరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా భూపరిపాలన ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలో మూడవ దశ రీసర్వే పనులను నిర్ణీత కాల పరిమితిలోగా పూర్తి చేయాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్, వెక్టోరైజేషన్, విలేజ్ సెక్రటరీ, వీఆర్వో, తహసీల్దార్, ఆర్‌డీఓ, జేసీ లాగిన్‌లలో డేటా ఎంట్రీ పక్కాగా జరగాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, డీఆర్వో మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

లేపాక్షి హస్తకళల ప్రదర్శనకు విశేష స్పందన



లేపాక్షి క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్‌లో వినియోగదారుల సందడి

కర్నూలు(అగ్రికల్చర్): ఈనెల 1న కర్నూలు లేపాక్షి హస్తకళా ఎంపోరియం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లేపాక్షి హస్త కళల ప్రదర్శన ఆకట్టుకుంటోంది. నగర వాసులతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలు వచ్చి తమకు కావాల్సిన వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. లేపాక్షి హస్త కళా ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌లో 40కిపైగా స్టాళ్లు ఉన్నాయని, సెలవు రోజులతో సహా ప్రతి రోజు ఉదయం నుంచే రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్ నడుస్తుందన్నారు. ఈ నెల 15 వరకు ప్రదర్శన ఉంటుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పురాణ, ఇతిహాసాలపై అవగాహన కల్పించాలి

కర్నూలు కల్చరల్: పురాణ, ఇతిహాసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద అన్నారు. చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ కాలనీలోని రవీంద్ర విద్యానికేతన్ పాఠశాలలో భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గీతా జయంతిని పురస్కరించుకుని మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం మండల స్థాయిలో పాఠశాలల్లో పోటీలు జరుగుతున్నాయన్నారు. ఇక్కడి విజేతలు జిల్లా స్థాయికి అర్హత సాధిస్తారన్నారు.

నేడు ఫ్రీ టాలెంట్ టెస్ట్

కర్నూలు సిటీ: పోలీసు కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులకు శుక్రవారం బిర్యాంపులోని టీజీ లక్ష్మీవెంకటేష్ కళ్యాణ మండపంలో ఫ్రీ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు హైదరాబాదు చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోలీసు అకాడమీ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నగరవాసుల సౌకర్యార్థమే ఖానా-ఖజానా



'ఖానా -ఖజానా' ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జి.సృజన

- ఈట్ స్ట్రీట్ ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్
- హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

కర్నూలు(టౌన్): నగరవాసుల సౌకర్యార్థం 'ఖానా -ఖజానా' ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. రూ.1.83 కోట్లతో బిర్లాగేట్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద ఏర్పాటు చేసిన ఖానా- ఖజానా, ఈట్ స్ట్రీట్, ప్లే ఏరియా, ఈవెంట్లను గురువారం రాత్రి ఎస్పీ క్రిష్ణకాంత్, మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, డాక్టర్ జరదొడ్డి సుధాకర్, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖానా-ఖజానా ఈట్ స్ట్రీట్‌ను ప్రజలకు నగరపాలక సంస్థ అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి సుందరీకరణమైన ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ కాలుష్యం లేని నగరంగా తీర్చిదిద్దడంతో ప్రజల సహకారం మరిచిపోలేనిదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకా, కార్పొరేటర్ సత్యనారాయణమ్మ, కాటసాని శివ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కంకణ బద్ధులు కావాలి

కర్నూలు కల్చరల్: హిందూ ధర్మ పరిరక్షణకు కంకణ బద్ధులు కావాలని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శౌర్య జాగరణ యాత్ర గురువారం డాక్టర్స్ కాలనీలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సనాతన ధర్మాన్ని పాటించాలన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలకు విలువ ఇవ్వాలన్నారు. హిందువులపై, ఆలయాలపై దాడులు జరగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. యువత దేశభక్తి కలిగి ఉండాలని,, దేశ రక్షణకు ముందుకు రావాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకలు కగ్గోలు హరీష్‌బాబు, వీహెచ్‌పీ, భజరంగ్‌దల్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లుల జారీ ప్రక్రియలో పొరపాట్లకు తావు ఇవ్వొద్దని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి సూచించారు. గురువారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మీటర్ రీడర్ తప్పనిసరిగా ఇల్లు, షాపుల వద్ద ఉన్న మీటర్ వద్దకు వెళ్లి బిల్లు తీయాలన్నారు. బిల్లింగ్ స్కానర్‌తో ప్రతి డిజిటల్ మీటర్‌ను స్కాన్ చేసి రీడింగ్ తీయాలన్నారు. స్కాన్ కాకపోవడం, వాడిన యూనిట్ల కంటే రీడింగ్ హెచ్చు తగ్గలు రావడం వంటి సమస్యలు తలెత్తితే రీడర్లు వెంటనే ఏఈల దృష్టికి తీసుకెళ్లేలా చూడాలని చెప్పారు. సమస్యను ఏఈలు తగిన పరిష్కరించాలన్నారు.

ప్రతిభ చాటండి

- మెప్మా పీడీ నాగశివలీల

కర్నూలు (టౌన్): మహిళలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వంటల్లో ప్రతిభ చాటి అదనంగా ఆదాయం పెంపొందించుకోవాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల అన్నారు. గురువారం స్థానిక మున్సిఫ్ కోర్టు వద్ద ఉన్న చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సమావేశ హాలులో కాన్ఫడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్యూనర్ ఏపీ చాప్టర్ ఆధ్వర్యంలో పౌష్టిక వంటల పోటీలు, శిక్షణా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ శిక్షణను మెప్మా పీడీ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, ఆర్షియా ఫర్హీన్ పాల్గొన్నారు.